


*(గత సంచిక తరువాయి)*

"**ఓ ఫాస్ట్ ఫుడ్ కార్నర్‌లో ఓ లేట్** టీన్స్‌లోని అమ్మాయి ఇలా మాట్లాడుతుందని నేను అనుకోలేదు. ఐ యాం గ్లాడ్ ఐ మెట్ యు."

"మా నాన్న ఎప్పుడూ ఒకటే చెప్తూంటారు. అనుభవం ఒక్కటే చాలదు. దాన్ని విశ్లేషించే జ్ఞానం కూడా ముఖ్యం. ఓసారి వేడి పాలలో మూతి పెట్టిన పిల్లి జీవితాంతం మళ్ళీ వేడి పాలలో మూతి పెట్టదు. అది జ్ఞానం. అది మళ్ళీ చల్లటి పాలలో కూడా మూతి పెట్టకపోవడం విశ్లేషణ లేకపోవటం."

"హి ఈజ్ రైట్."

"ఓ రోజు మా నాన్న నన్ను అడిగారు, 'ఓ మామిడిచెట్టుని నాటడానికి సరైన సమయం ఏది?' అని. 'వానాకాలం' అని జవాబిచ్చాను. 'కాదు. పదిహేనేళ్ళ క్రితం. ఆనాడే నాటి ఉంటే ఇవాళ మామిడిపండు తినేవాళ్ళం కదా' అన్నారు."

"హౌ ట్రూ! సరైన పనిని సరైన టైంలో చేయాలి అని చక్కగా చెప్పారు."

"తర్వాత 'ఓ మామిడిచెట్టుని నాటడానికి రెండో సరైన సమయం ఏది?' అని అడిగారు. '

'మొదటి సరైన రోజుకి తర్వాతి రోజు' అని మా అన్నయ్య చెప్పాడు. 'అది తప్పు. ఆ మర్నాడు నాటలేదు కదా? అందుకు సరైన రోజు నేడే' అని చెప్పారు నాన్న. ఆ రోజే మా అన్నయ్య తెచ్చి మామిడిచెట్టుని నాటాడు. ఈ వేసవిలో అది తొలి కాపు కాసింది."

కొద్దిసేపు నిశ్శబ్దం.

"ప్రేమ గురించి కంటే ఈనాటి టీనేజ్ అమ్మాయిలు 'పెళ్ళి ఆగిపోతే ఎలా?' అనేలాంటివి ఆలోచించడం బెటర్. పెళ్ళంటే లక్షల ఖర్చు. ఏ బంధువో పోయి పెళ్ళి ఆగిపోతే ఆదుకునే భీమా ఉందని ప్రేమలో పడ్డ ఎంతమంది అమ్మాయిలకి తెలుసు? హైదరాబాద్‌లో కర్ఫ్యూ లేదా బంద్ కారణంగా పెళ్ళి బెజవాడకి మారితే, కళ్యాణ మండపం, పందిరి అలంకరణ, మేళతాళాలు, క్యాటరింగ్ సర్వీస్‌లకి ఇచ్చిన అడ్వాన్సులు నష్టపోకుండా భర్తీ చేసుకునే వీలుని వెడ్డింగ్ ఇన్సూరెన్స్ కలిగిస్తోంది. శాంతి భద్రతల లోపంవల్లో, వాతావరణం అనుకూలించకో, పెళ్ళికొడుకో, పెళ్ళి కూతురో ప్రయాణ సాధనం విఫలం అయి ముహూర్తానికి హాజరు కాకపోయినా ఏర్పాట్లన్నీ వృధానేగా? లేదా సమీప బంధువుల మరణం వల్ల పెళ్ళి ఆగిపోవచ్చు. పెళ్ళికి మూడు రోజుల ముందునుంచి ఆగిపోయే పెళ్ళిళ్ళని భీమా కవర్ చేస్తుంది. 'రఘూ! నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా? మొన్న మూడు ఎస్ ఎం ఎస్ లు ఇచ్చి నిన్న రెండే ఇచ్చావే? నా మీద నీకు ప్రేమ తగ్గింది కదా?' అనే ఆడపిల్లల్ని చూస్తే నాకు జాలి."

"మిమ్మల్ని పెళ్ళి చేసుకునేవాడు అదృష్టవంతుడు. చాలామంది భర్తలకి ప్రేమరాహిత్యంతో బాధపడే భార్యలే నరకంగా మారతారు.

డబ్బుని దుబారా చేసేవారు, బయటి వ్యక్తుల ముందు తన భార్యని తిట్టేవారు, తల్లి చాటు కొడుకులు, పెద్దాశ గల భర్తలు భార్యల జీవితాన్ని నరకంగా మారుస్తారు."

మళ్ళీ కొద్దిసేపు వారి మధ్య నిశ్శబ్దం.

"టివిలో వచ్చే కొందరు అమ్మాయిలని చూస్తే నాకు బాధేస్తుంది. ఎవర్నో ప్రేమిస్తారు. పెళ్ళి కాకపోయినా అతనితో సుఖంగా గడుపుతారు. తర్వాత అతను ఏ కారణంగానో ఆమెకి దూరం అవుతాడు. ఆమె రచ్చకి దిగుతుంది. అతను ఆమెనేం బలవంతం చేయలేదే? ఆమె స్వచ్ఛందంగానేగా అతనికి తన శరీరాన్ని అప్పగించింది? అతనిలా ఆమె కూడా సుఖం ఆశించే కదా ఆ పని చేసింది? అంతమాత్రం చేత ఆమెకి అతను తనని వివాహం చేసుకోవాలని నిలదీసే హక్కు ఎలా వస్తుంది? ప్రేమించడం పెళ్ళి చేసుకుంటానని మాట ఇవ్వడం కాదుగా? ఆమెని ఎవరు అంత అడ్వాన్స్ అవమన్నారు? మహిళా సంఘాలు కూడా ఆమెని వాడుకుని వదిలేసాడని అతన్ని దుయ్యబడతాయి. ఆమె మాత్రం అతన్ని తన శారీరక వాంఛలకి వాడుకోలేదా? కేవలం అతని కోరికనే తను భావరహితంగ ఏ ఆడదైనా తీర్చకలదా? అతన్ని దోషిగా సమాజం ముందు టివి మీడియా నిలబెట్టడం అధర్మం అని నా అభిప్రాయం. ఒక్కరంటే ఒక్కరు కూడా 'పెళ్ళికాకుండా నువ్వు బుద్ధిలేకుండా అతనితో ఎందుకు అడ్వాన్స్ అయ్యావు?' అని అడగరు. పెళ్ళికి ముందు మనసు మార్చుకుని దూరం అవడం సబబా? ఒకవేళ వత్తిడికి లొంగి పెళ్ళిచేసుకున్నాక అతను కొన్ని వారాల తర్వాత విడాకులు కోరుకుంటే అప్పుడు ఆమె టి.వి తెరమీదకి వచ్చి అతని మీద ఫిర్యాదు చేయగలదా? చేసినా అప్పుడు టివి వారు దాన్ని ప్రసారం చేస్తారా? నిజాయితీగా అతను పెళ్ళివద్దు అన్నప్పుడు, అంటే రెండోవైపు అంగీకారం లేనప్పుడు నేనైతే విడిపోదాం అంటాను కానీ అతని మీద దౌర్జన్యం చేయను. ఇది ఎమోషనల్ బ్లాక్ మెయిల్. సాంఘిక టెర్రరిజం."

"మీరోసారి ఈ టాపిక్ మీద టివిలో మాట్లాడాలి. ఇంకో కోణం నించి కూడా విశ్లేషణ మన సమాజానికి అందాలి. మీరు చదివిన ఆఖరి పుస్తకం ఏమిటి? అది కాలక్షేపానికి కాక జీవితంలో ఉపయోగించేదే అయి ఉంటుంది అని అనుకుంటాను" అడిగాడు త్రివిక్రం.

"ఈజ్ యువర్ పాస్ వర్డ్ సేఫ్?"

"గుడ్ ఇలాంటిదే ఏదో అనుకున్నాను. రొమాంటిక్ నవల అనుకోలేదు."

"లిజా, రాబర్ట్‌ల మధ్య ప్రణయ కథ చదివితే మనం ఇంటలెక్చువల్‌గా ఎదగం. బహుశా దిగజారతాం. బదులుగా ఇలాంటి పుస్తకాలు చదివితే ఎదుగుతాం. అది చదివాకే తెలిసింది, పాస్ వర్డ్ ఖచ్చితంగా తొమ్మిది సంఖ్యకి తగ్గకూడదు. కేవలం లోయర్ కేస్ అక్షరాలతో పెట్టుకున్న పాస్‌వర్డ్‌ని హేకర్‌లు పది నిముషాల్లో కొనుక్కోగలరట. అప్పర్, లోయర్ కేసులని కలిపిన పాస్‌వర్డ్‌ని కనుక్కోవటానికి హేకర్ కంప్యూటర్‌కి పది గంటలు పడుతుందట. అంకెలు, గుర్తులతో కూడిన పాస్ వర్డ్‌ని కనుక్కోవటానికి పద్దెనిమిది రోజులు పడుతుందిట. ఈ జాగ్రత్తలతో ఉన్న మన పాస్‌వర్డ్‌ని బ్రేక్ చేయడానికి హ్యాకర్‌కి 44,530 సంవత్సరాలు పడుతుందిట."

"ఈలోగా మనం ఇంకోసారి మార్చుకుంటే సరి." చెప్పాడు త్రివిక్రం.

ఫక్కున నవ్వింది స్ఫూర్తి.

"ఏ గుడ్ హజ్బెండ్ ఈజ్ ది ఒన్ విత్ ఏ సెన్సాఫ్ హ్యూమర్."

"మంచి విషయం చెప్పారు. ఇంటికి వెళ్ళాక నేను చేసే మొదటి పని నా పాస్‌వర్డ్‌ని మార్చేయటం. లేదా పదినిముషాల్లో మీరేదాన్ని కనుక్కోగలరు."

"ఏభై శాతం మంది గుర్తుంచుకోవటం తేలిక అని 12345 అని లేదా, ఎబిసి123ని లేదా, క్యు డబ్ల్యు ఈ ఆర్ టి వై ని పాస్ వర్డ్‌గా వాడతారట."

"నాది ఏ ఎస్ డి ఎఫ్ జె కె ఎల్. గుర్తుంటుందని అది పెట్టుకున్నాను. మీతో మాట్లాడిన కాసేపటిలో మీరు నాన్సెన్స్‌ని ఇష్టపడరని, కామన్‌సెన్స్‌ని ప్రేమిస్తారని నాకు అర్థమైంది." చెప్పాడు త్రివిక్రం.

"కామన్‌సెన్స్ లోపిస్తే మనిషి బుద్ధిని ఉపయోగించడం లేదని అర్థం. ఆ జపనీస్ వ్యాపారస్థుడిలా అందువల్ల కలిగే అనర్థాలని తనే అనుభవించాల్సి వస్తుంది." నవ్వింది.

"ఆ ఉదంతం కూడా వివరంగా చెప్తేనే కదా నాకు తెలిసేది?" అడిగాడు త్రివిక్రం.

"న్యూ ఇయర్ గిఫ్ట్‌గా ఒక జపనీస్ వ్యాపారస్థుడు తన ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బందికి తలో పేజర్ చొప్పున యాభై పేజర్లు కొన్నాడు. వాటిని కార్లో వెనక సీట్లో పెట్టి ఫ్యాక్టరీకి బయలుదేరాడు. పావుగంట తరువాత అకస్మాత్తుగా వెనక సీట్లోంచి యాభై పేజర్లు ఒకేసారి మోగాయి. అతనికి ఆ శబ్దానికి ఎంత భయం వేసిందంటే, కారు కంట్రోల్ తప్పి వెళ్ళి ఓ లైటు స్థంభానికి గుద్దుకుంది. తన కారుకి జరిగిన నష్టాన్ని ఆ వ్యాపారస్థుడు పరిశీలించాక పేజర్లలో వచ్చిన మెసేజ్‌ని చదివాడు. 'కంగ్రాచ్యులేషన్స్ ఆన్ బీయింగ్ ది ఓనర్ ఆఫ్ ఏ పేజర్' అన్న ఆ మెసేజ్‌ని దాన్ని అమ్మిన దుకాణం దారు పంపాడు. ఆ మెసేజ్‌ని చూసిన కస్టమర్‌కి కలిగే ఆనందం ఆ వ్యాపారస్థుడికి కలగలేదు. ఆ కస్టమర్ ఆ వ్యాపారస్థుడి మీద నష్టపరిహారానికి దావ వేసి గెలిచాడు."

చిన్నగా నవ్వాడు త్రివిక్రం. ఇద్దరూ తిని. తాగటం అయిపోయాక తన సెల్ ఫోన్‌లోని టైమ్‌ని చూసుకుని అడిగింది స్ఫూర్తి.

"ఇక వెళదామా?"

"ష్యూర్. పునర్దర్శనం?"

"ఓ రోజు కలుద్దాం. నేను మెయిల్ పంపుతాను."

"మీరు ఆలోచించుకుని నా ప్రపోజల్‌కి జవాబు చెప్పండి."

ప్రశ్నార్థకంగా చూసింది స్ఫూర్తి.

"నేను ఎయిటీ బార్న్. మీరు బహుశా ఎయిటీ నైన్, నైన్టీ బార్న్. మన మధ్య పదేళ్ళ తేడా ఉండచ్చు. ఇది గట్టిగా ఆలోచించాల్సిన విషయం. మన పరిచయం పెళ్ళిదాకా దారి తీసే పక్షంలో ఇంకోసారి కలుద్దాం. లేదా ఇంటర్నెట్‌లో ఛాటింగ్ మానేద్దాం. నాకు ఇంతదాకా ఎలాంటి భార్య కావాలో స్పష్టమైన అవగాహన లేదు. కానీ నాకన్నా బాగా చిన్నదానివైనా, మీరు మేధాపరంగా ఆ విషయంలో పై మెట్టులో ఉన్నారు. మీ నాన్నగారితో మాట్లాడి మరీ మళ్ళీ కలుద్దామో వద్దో తగిన నిర్ణయం తీసుకుని చెప్పండి."

"థాంక్స్ ఫర్ బీయింగ్ ఫ్రాంక్" చెప్పింది స్ఫూర్తి.

ఆమెని కారులో లక్ డీ కా పూల్‌లో దింపి వెళ్ళిపోయాడు త్రివిక్రం.

వెనకే ఆగిన ఆటోలోంచి స్ఫూర్తి కన్నా మూడేళ్ళు పెద్దయిన ఓ యువకుడు దిగి స్ఫూర్తి దగ్గరికి వెళ్ళాడు.

"ఏం మాట్లాడారు?" అడిగాడు.

"సెల్‌లో రికార్డు చేసాను. ఎలా అనిపించాడు నీకు?" ప్రశ్నించింది స్ఫూర్తి.

"వెల్ గ్రూమ్డ్. స్టైలిష్‌లోఈ డ్రెస్డ్. చూడగానే మంచి ఇంప్రెషన్ ఏర్పడింది."

బి.హెచ్.ఇ.ఎల్‌కి వెళ్ళే బస్ రాగానే ఇద్దరూ దాన్ని ఎక్కారు.

జగ్గయ్య త్రివిక్రంకి ఫోన్ చేసి చెప్పాడు.

"మీ రిపోర్ట్ వచ్చింది. ఇవాళే నీకు కొరియర్ చేసాను. రేపు ఉదయం అందుతుంది."

"థాంక్స్."

మర్నాడు ఉదయం పదిం పావుకి హాస్పిటల్‌కి చేరుకునేసరికే త్రివిక్రం కోసం ఆ కవరు టేబుల్ మీద సిద్ధంగా ఉంది. నర్స్ సంతకం చేసి తీసుకుంది. దాన్ని వణికే చేతులతో చింపి డి.ఎన్.ఏ రిపోర్ట్‌ని బయటికి తీసి చదివాడు.

హరినాథ్ డి.ఎన్.ఏతో తన డి.ఎన్.ఏ కలవలేదు.

అంటే హరినాథ్ తన తండ్రికాదు. ఐతే తన తండ్రి ఇక మిగిలి ఉన్న నవనీత్ అయి ఉంటాడా? ఆయన ఎక్కడున్నాడు? చిన్నగా నిట్టూర్చి శ్యామలరావుకి ఫోన్ చేసాడు. జరిగింది అతనికి చెప్పాడు.

మర్నాడు ఉదయం శ్యామలరావు త్రివిక్రం ఇంటికి వచ్చి కలిసాడు.

"నవనీత్ జాడ ఇంతవరకూ తెలియలేదు సార్. వ్యాపారం చేసేవారికి సంబంధంగల అన్ని ప్రభుత్వ కార్యాలయాలకి వెళ్ళి ప్రయత్నించాను. ఎవరి దగ్గరా అతడి వ్యాపారానికి సంబంధించిన సమాచారం లేదు. అతని పేరు మీదగల ఫోన్‌లు అన్నిటికీ ఫోన్ చేసాను. ఊహూ. మనకి కావలసిన నవనీత్ ఆ ఫోన్లలో ఉన్నవారు కాదు. యు.పి, గుజరాత్‌కి చెందినవారిలో నవనీత్ పేరు ఎక్కువగా ఉంది. ఆయన తెలుగు అతనేనా?

"అనుకుంటాను. ఎవరూ తెలుగేతరుడు అని చెప్పలేదు. మరెలా?"

"నేను పూర్వం మనుషుల్ని ట్రేస్ చేసిన విధానాలన్నీ ప్రయత్నించాను. బహుశా అతను హైదరాబాద్ వదిలి ఎక్కడికైనా వెళ్ళిపోయి ఉంటాడు. అతను చదివిన వివేకవర్ధిని కాలేజీకి వెళ్ళి, అతని స్వగ్రామం వివరాలు అక్కడ రికార్డులో ఉన్నాయేమోనని ప్రయత్నించి చూసాను. దురదృష్టవశాత్తు వారి దగ్గర అంత పాత రికార్డులు లేవని చెప్పారు."

"సరే, ఇంకేమైనా దారి దొరుకుతుందేమో ఆలోచించండి. మీ శ్రమకి థాంక్స్."

తను ఇవ్వాల్సిన పదిహేను వందలకి కొంత కలిపి ఐదువేల రూపాయలు శ్యామలరావుకి ఇచ్చాడు. కానీ అతను రెండువేల ఏడువందలే తీసుకుని మిగిలింది వెనక్కి ఇచ్చేస్తూ చెప్పాడు.

"ఇది మాత్రమే నేను ప్రభుత్వ కార్యాలయాల్లోని క్లర్కులకి సమాచారం కోసం లంచంగా ఇచ్చిన మొత్తం. నాకు ఇందుకు ఒక్క పైసా కూడా వద్దు."

అతను వెళ్ళాక ఆ విషయం గురించి త్రివిక్రం సుందరేశన్‌తో చర్చించాడు.

"ప్రైవేట్ డిటెక్టివ్‌ని నియమిస్తే?" సూచించాడు ఆయన.

త్రివిక్రం ఎల్లో పేజెస్ తెరచి కొన్ని ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలకి ఫోన్ చేసాడు. అంతా కనీసం యాభైవేల రూపాయలు చెల్లించాలని చెప్పారు. త్రీ స్టార్ హోటల్ అకామిడేషన్, అవసరమైతే విమాన ప్రయాణాలకి, ఇతర ఖర్చులకు అదనంగా చెల్లించాలని చెప్పారు. ఏతావాతా, వారు చెప్పినదాన్ని బట్టి లక్షదాకా అవవచ్చనిపించింది.

ప్రస్తుతానికి త్రివిక్రం నవనీత్‌ని వెదికే పనిని ఏం చేయాలో తోచక తప్పనిసరై వాయిదా పెట్టాడు. మిగిలిన ముగ్గురూ డి.ఎన్.ఏ పరీక్షల్లో ఎలిమినేట్ చేయబడ్డారు కాబట్టి ఆయనే తన బయోలాజికల్ తండ్రి అనే నమ్మకం త్రివిక్రంలో కలిగింది. అందువల్ల ఆ సంగతి రూఢి చేసుకోవాలనే కోరిక అతనిలో బలంగా ఉంది.

స్ఫూర్తిని త్రివిక్రం కలిసిన నాలుగురోజులదాకా ఆమె ఛాటింగ్‌లో అతనికి కలవలేదు. ఆమెనించి ఈ మెయిల్స్ కూడా ఏం రాలేదు. తనని వివాహం చేసుకోవటం ఇష్టంలేకపోతే ఇక కాంటాక్ట్ చేయొద్దని చెప్పడం వల్ల ఆమె నించి ఎలాంటి సమాచారం లేదని త్రివిక్రం నిశ్చయించుకున్నాడు కూడా.

ఓరోజు తన పిన్నికి జానకి సలహా మీద త్రివిక్రం ఓ పెళ్ళిళ్ళ వెబ్ సైట్‌కి క్రెడిట్ కార్డ్ ద్వారా డబ్బు చెల్లించి, తన ప్రొఫైల్‌ని అందులో పెట్టాడు. పెళ్ళికూతురు క్వాలిఫికేషన్‌లో డాక్టర్ ఐ ఉంటే బావుంటుందని, మాతృభాష తెలుగై ఉండాలని, హైదరాబాద్, కృష్ణ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలకి చెందినవారయితే మంచిదని, తనకన్నా రెండేళ్ళు చిన్న వయసు కలిగి ఉండాలని పేర్కొన్నాడు.

ఎప్పుడో చదివిన వ్యాసం అతనికి గుర్తొచ్చింది. ఒక్కరే సంతానం వుంటే వారిని గారాబంగా పెంచటంతో, తల్లిదండ్రుల దగ్గర ఆడింది ఆటగా పాడింది పాటగా పెరగడంతో, పెళ్ళయ్యాక జీవిత భాగస్వామినించి కూడా అలాంటిదే ఎదురు చూస్తారని, లేదా విడిపోవచ్చని, అందువల్ల ఒకే సంతానం గలవారిలో విడాకులు అధికం అని. అందుకని ఇద్దరు లేక ముగ్గురు గల కుటుంబం నించి వచ్చి ఉండాలని కూడా నమోదు చేసాడు.

అతని రెండురోజుల్లో ఆరేడు ఎంక్వైరీలు వచ్చాయి. అంతా జాతకం కాని, డేటాఫ్ బర్త్, ప్లేస్ ఆఫ్ బర్త్ కానీ పంపమని మెయిల్ యిచ్చారు. కొందరు పంపిన తమ కూతుళ్ళ ఫోటోలు కూడా చూసాడు. కొందరు వాటిని రహస్యంగా ఉంచారు. వారి తల్లిదండ్రులతో ఈ మెయిల్‌లో, ఫోన్లో మాట్లాడటం త్రివిక్రంకి సరదాగా ఉంది.

16

ఆ రోజు స్ఫూర్తి తండ్రి బలదేవుడు కాలేజీనించి వచ్చిన స్ఫూర్తిని అడిగాడు.

"త్రివిక్రం గురించి కూల్‌గా ఆలోచించుకోడానికి నీకు ఇచ్చిన రెండువారాల గడువు ఇవాళ్టికి తీరింది. ఏం ఆలోచించుకున్నావు?"

"మా మధ్య వయసులోని తేడానే కదా మీకు అభ్యంతరం?" అడిగింది స్ఫూర్తి.

"అవును."

"మిగిలినవన్నీ ఒకేనా మీకు?"

"ఒకేనే."

"విక్రం నా కన్నా తొమ్మిదేళ్ళు పెద్దని నేను అనుకోవడంలేదు. నాకన్నా పదేళ్ళు ఎక్కువ అనుభవంగల నా వయసువాడని భావిస్తున్నాను."

"మాటలతో సమర్థించుకోవడం తేలిక."

"సమర్థించుకోవడం కాదు పెళ్ళంటే కాంప్రమైజ్. ఏ పెళ్ళి సంబంధం విషయంలో అయినా కొన్ని విషయాల్లో కాంప్రమైజ్ తప్పదని నాకు ఈ రెండు వారాల్లో తెలిసింది నాన్నా. వివాహం అయిన మా ఫ్రెండ్స్ అక్కలు, అన్నలని చిన్న సైజు ఇంటర్వ్యూ చేసాను. వాళ్ళంతా కూడా తాము ఆశించిన కొన్ని క్వాలిఫికేషన్ల విషయంలో తమ జీవిత భాగస్వాములతో రాజీపడ్డామనే చెప్పారు. ఒకరు తన పేరు ఎస్ అక్షరంతో మొదలవుతుంది కాబట్టి ఆమె పేరులోని మొదటి అక్షరం కూడా ఎస్‌తో స్టార్ట్ అవాలని అనుకున్నారు. తమకి పుట్టబోయే పిల్లలకి కూడా ఎస్ అక్షరంతోనే మొదలయ్యే పేర్లని పెట్టాలని అతనికి ముచ్చట. కానీ ఆ ఒక్కటీ తప్ప మిగిలినవన్నీ నచ్చడంతో అతను ఆ విషయంలో కాంప్రమైజ్ అయ్యాడు. ఇంకొకరి విషయంలో ఓ డాక్టర్ తన భర్త కూడా డాక్టర్ అయి ఉండాలని కోరుకుంది. కానీ చివరికి ఛార్టెడ్ అకౌంటెంట్‌ని చేసుకుంది. అత్తమామలు జీవించి ఉండాలి, అందువల్ల పండగలకి పిలవడాలు, పెట్టుపోతలు ఉంటాయని, ఒకరి తల్లిదండ్రులు భావించారు. కానీ చివరకి వారికి లేని సంబంధమే కుదిరింది. ఇలా ప్రతీవారూ ఏదో విషయంలో కాంప్రమైజ్ అయ్యామనే చెప్పారు. అంతా నాలుగైదు విషయాల్లో కూడా కాంప్రమైజ్ అయ్యారు. రేపు నువ్వు నాకోసం సంబంధాలు వెదికినప్పుడు కూడా మనం ఇలా చాలా విషయాల్లో కాంప్రమైజ్ అవాల్సి ఉంటుంది. అవునా?"

బలదేవుడు మౌనంగా తల పంకించాడు.

"అమ్మ విషయంలో మీరు కాంప్రమైజ్ అయ్యారా?" ఆ సంభాషణ విన్న స్ఫూర్తి అన్నయ్య రవితేజ నవ్వుతూ అడిగాడు.

"లేదు. అవన్నీ ఇప్పుడు ఎక్కువ అయ్యాయి. అసలు ఫలానావి ఉండాలన్న ఆలోచనే నాకు ఆ రోజుల్లో రాలేదు కాబట్టి ఆ సమస్యే రాలేదు."

కాసేపు మౌనం తర్వాత అడిగాడు ఆయన మళ్ళీ.

"అన్నీ నువ్వే స్వతంత్రంగా ఆలోచించుకునేలా పెంచాం. నీ బట్టలు ఎడ్యుకేషన్ ఫాకల్టీ ఇంతదాకా నీ జీవితంలోని అన్నీ నువ్వు స్వతంత్రంగానే నిర్ణయించుకుంటూ వస్తున్నావు. పెళ్ళి విషయంలో నీ ఆ స్వతంత్రాన్ని నేను ఎందుకు వెనక్కి తీసుకోవాలి? నీకు ఎలా చేస్తే బావుంటుంది అనిపిస్తే అలా చెయ్యొచ్చు. నాకు అభ్యంతరం లేదు" చెప్పాడు బలదేవుడు.

"ఐనా మరో వారం గడువు తీసుకుని తర్వాత చెప్తాను. నాకు అన్నీ 'ఎస్' అనే కారణాలే కనపిస్తున్నాయి. ఒక్క 'నో' కోసం చూస్తున్నా. దొరకడం లేదు." స్ఫూర్తి చెప్పింది.

తండ్రి చిన్నగా నవ్వి చెప్పాడు.

"ఎవరికైనా పెళ్ళికి ముందు అన్ని 'నో'లు కూడా 'ఎస్'లాగానే కనిపిస్తాయి. పెళ్ళయ్యాక 'ఎస్'కూడా 'నో'లానే కనిపిస్తుంది."

"అతను నాతో మాట్లాడింది విన్నాక మీకు ఏమని అనిపించింది నాన్నా?"

"ఆ కాసిన్ని మాటల వల్ల ఓ మనిషిని మంచి అల్లుడు అవుతాడా లేక చెడ్డ అల్లుడు అవుతాడా? అన్నది నిర్ణయించడం కష్టం."

"అతని తల్లికి తను ఎలా పుట్టాడో చెప్పాడు కదా. అది అతను అంత ఓపెన్‌గా చెప్పాడు. నిజాయితీ మనిషి కదా?"

ఆయన ఏదో మాట్లాడబోయి తమాయించుకుని ఆగిపోయాడు.

"నువ్వేమంటావురా?" స్ఫూర్తి తన అన్నయ్య రవితేజని అడిగింది.

"మీ ఇద్దరు ఎత్తు సరిపోతారు. ఒకరి పక్కన ఒకరు మేచింగ్‌గా ఉంటారు. అతనికి నలభై, నలభై ఐదు వచ్చేదాకా ఓకేనే.

"ఆ తర్వాత?"

"అతని జుట్టు నెరవడం మొదలవుతుంది. నీ జుట్టు ఆ తర్వాత తొమ్మిదేళ్ళకి కానీ నెరవదు. కొత్తవారు తనకి నువ్వు పెద్ద కూతురివి అని పొరబడుతూండటం మొదలవుతుంది."

"ఏడ్చావ్."

"ఇంత ఏజ్ గేప్‌తో నువ్వు నాన్నని ఎలా చేసుకున్నావు? అని మీ పిల్లలు లేట్ టీన్స్‌లోకి వచ్చాక అడక్కపోతే చూడు."

"థాంక్స్ రా."

"దేనికి?"

"సంతాన ప్రాప్తిరస్తు" అని దీవించినందుకు.

"ఏడ్చావ్" రవితేజ చెప్పాడు.

స్ఫూర్తిని కలిసిన ఇరవై రెండోరోజు ఆమెనించి ఈ మెయిల్ రావటం చూసి త్రివిక్రం ఆత్రంగా దానిమీద క్లిక్ చేసి ఓపెన్ చేసాడు.

"మరోసారి కలుద్దామా? సేమ్ ప్లేస్. బుధవారం ఏడున్నరకి వీలవుతుందా?" అని ఉంది.

"ఆ రోజు నాకు ఆ సమయంలో డ్యూటీ ఉంటుంది. శనివారం ఓకేనా?" జవాబు ఇచ్చాడు.

"ఓకే శనివారం సాయంత్రం ఆరున్నరకి మెక్ డొనాల్డ్స్, హిమాయత్ నగర్‌లో" అని స్ఫూర్తి నించి మర్నాడు మెయిల్ వచ్చింది.

అప్పటికే త్రివిక్రం వెబ్ సైట్ ద్వారా ఇద్దరు పెళ్ళికూతుళ్ళని సెలక్ట్ చేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం నాలుగున్నరకి ఒకరింటికి పెళ్ళిచూపులు కూడా ఫిక్స్ ఐంది. ఆమె డెంటల్ డాక్టర్.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in